క్లుప్తంగా

రేపు ఏపీజీబీ ఎదుట నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడపలోనే ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కొనసాగించాలని కోరుతూ శనివారం ఆ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నట్లు ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును విలీనం పేరుతో అమరావతికి తరలిస్తున్నారన్న వార్తలు తెరపైకి వచ్చాయని, దీనిపై ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వెనకబడిన రాయలసీమలో మరికొన్ని పెద్ద సంస్థలు, కార్యాలయాలు, పరిశ్రమలను నెలకొల్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ ఓబులేసు

కడప అర్బన్ : కడప నగరం చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరాశ్రయులకు, రోడ్ల మీద తిరుగుతున్న వారికి కడప చిన్నచౌకు సీఐ జి.ఓబులేసు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న చౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి, ఎస్ఐ రవి కుమార్, వినాయక ఫౌండేషన్ అధ్యక్షుడు దీటి గోపాలకృష్ణ, మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణు వర్ధన్, ఆర్య శ్రీ ఫౌండేషన్ అధ్యక్షులు రంజిత్, పీఎస్ఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉపేంద్ర, తిరుపాలు, సుబ్బ రాముడు, తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ : యోగివేమన విశ్వ విద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'వీక్షిత్ భారత్ క్విజ్' పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ వీక్షిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ అనేది నేషనల్ యూత్ ఫెస్టివల్-2025 రూపాంతరమైన పునర్నిర్మాణమన్నారు. భారతదేశ భవిష్యత్తు రూపకల్పనలో యువత భాగస్వామ్యం పెరగాలన్న ప్రధాన మంత్రి దార్శనికతకు అనుగుణంగా వీక్షిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ అని పేరు నిర్ణయించారన్నారు. ఈ డైనమిక్ ప్లాట్‌ఫారం 'వీక్షిత్ భారత్' ద్వారా భారతదేశం ముఖ్యమైన మైలురాళ్లు, విజయాల గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆన్‌లైన్‌లో క్విజ్ కాంపిటీషన్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని సర్టిఫికెట్స్ పొందారు.

విచారణ జరిపించాలి



ఏడీకి వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలుర ఎయిడెడ్ పాఠశాలల్లో జరిగిన పోస్టుల భర్తీలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్జేడీ కార్యాలయంలో ఏడీ విజయ్‌కుమార్‌కు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరిగిన టీచర్ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని బహిరంగంగా చర్చ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కన్వీనర్ విజయ్, నాయకుడు ఉదయ్ పాల్గొన్నారు.

ఘనంగా బర్సీ మహోత్సవం

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా-ఏ-గఫారియాలో శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం దర్గా పీఠాధిపతి, సజ్జాదే నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో అశేష భక్తజన సందోహం నడుమ బర్సీ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాత బస్టాండు సమీపంలోని గంధం ఇంటి నంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. భక్తులు పీఠాధిపతి ఆధ్వర్యంలో స్వామి వారి మజార్లపై పూల చాదర్ సమర్పించి, గంధం ఎక్కించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు.

బైక్ మెకానిక్‌ల జీవనం దుర్భరం



❑ ఇక్కడ టూ వీలర్ బండిని రిపేరు చేస్తున్న మెకానిక్ పేరు ఖలీల్. కడప నగరం, పాలెంపాపయ్య వీధిలో మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నారు. సొంతంగా ఒక షాపును పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అందుకు ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదు. ప్రస్తుతం మెకానిజమ్‌లో ఆధునిక యంత్రాలు వచ్చాయి. బండిని రిపేరు చేయడానికి ఎలక్ట్రానిక్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వాటిని కొనుగోలు చేయాలంటే వేలాది రూపాయలు వెచ్చించాలి. 'ఆర్థిక స్థోమత లేని కారణంగా సొంతంగా మెకానిక్ షాపు ఏర్పాటు చేసుకోలేక పోతున్నాను' అని ఖలీల్ అన్నారు. ఇలా ఎంతో మంది మెకానిక్‌లకు చేతిలో నైపుణ్యం ఉన్నా పెట్టుబడి లేక బతుకుబండి ముందుకు కదలక మొండికేస్తోంది.



టూ వీలర్స్‌ను మరమ్మత్తులు చేస్తున్న మెకానిక్‌లు

- ఆర్థికంగా వెనుకబాటుతనం
- చేయూతనిస్తే కదులుతుంది.. బతుకు బండి

కడప రూరల్ : జిల్లా కేంద్రమైన కడప నగరంలోనే దాదాపుగా 200కు పైగా టూ వీలర్స్ మెకానిక్‌లు ఉంటారనేది ఒక అంచనా. జిల్లా వ్యాప్తంగా అయితే 1500కు పైగా ఉంటారని తెలుస్తోంది. ఈ రంగంలో అన్నీ అనుకూలించి ఆర్థిక పరిస్థితి బాగున్న వారు కొంతమంది ఉన్నారు. ఆర్థికంగా వెనుకబాటుతనంతో ఉండి సరైన వనరులు లేక ఇబ్బందులు పడే వారి పరిస్థితే దయనీయంగా మారింది. మెకానిక్‌లుగా మెరుగ్గా ఉన్నవారు కొందరైతే.. బాగలేని వారే ఎక్కువ సంఖ్యలో ఉండడంతో సమస్యగా మారింది.

పనికిరాకుండా పోతున్న పనితనం

మెకానిజమ్‌లో మ్యానువల్ విధానం తెరమరుగైంది. ఇప్పుడంతా బీఎస్-6కు అనుబంధంగా ఉండే సెన్సార్ చెకప్, పెట్రోల్ గేజ్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఆ యంత్రాలు ఉంటే మెకానిజమ్ సులభతరంగా ఉంటుంది. వాహన యజమానికి సంతృప్తికరంగా ఉంటుంది. అయితే ఆ మిషన్‌లు కొనుగోలు చేయాలంటే వేలాది రూపాయలు వెచ్చించాలి. అంత పెట్టుబడి పేద మెకానిక్‌ల వద్ద లేకపోవడంతో ఇతరుల వద్ద పని చేసుకుంటూ చాలీచాలని డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. పైగా ప్రస్తుతం ఏదైనా చిన్న షెడ్ లాంటిది ఏర్పాటు చేసుకోవాలన్నా అడ్వాన్స్, నెల బాడుగ, ఇతర ఖర్చులకు వేలాది రూపాయలు ఖర్చు చేయాలి. ఆర్థికంగా ఎలాంటి సహకారం లేకపోవడంతో మెకానిక్‌లు ఇబ్బందులు పడుతున్నారు. నమ్ముకున్న వృత్తిలో ఉంటూ జీవనం సాగించడానికి ఆదుకోవాలని అర్థిస్తున్నారు. పనితనం పది మందికి ఉపయోగపడేలా చూడాలని అంటున్నారు.

అసంఘటిత కార్మికుల్లో చేర్చాలి



మెకానిక్‌ల జీవితం అధ్వానంగా ఉంది. ఈ రంగంలో ఎక్కువ మంది నిరుపేదలే ఉన్నారు. మెకానిక్ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. మెకానిక్‌లను అసంఘటిత కార్మికుల జాబితాలో చేర్చాలి. పేద మెకానిక్‌లకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు అందజేయాలి.

\- పి.ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షుడు, టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్, కడప

ఆదుకోవాలి



మెకానిక్‌లు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. కుటుంబాన్ని పోషించడానికి కూడా చాలా ఇబ్బంది పడుతున్నాం. పిల్లలను చదివించుకోలేక పోతున్నాం. ప్రభుత్వం మాకు పథకాలు ప్రవేశ పెట్టి ఆదుకోవాలి. అందుకోసం నిజమైన మెకానిక్‌లను గుర్తించి సహాయ సహకారాలు అందజేయాలి.

\- కరీముల్లా, మెకానిక్, పాలెంపాపయ్యవీధి, కడప

మద్యం అమ్మకాలపై కమీషన్ పెంచాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రభుత్వం చెల్లించే కమీషన్‌ను 9 శాతం నుంచి గెజిట్లో పేర్కొన్న విధంగా 20 శాతానికి పెంచకపోతే ఈ నెల 14 నుంచి మద్యం కొనుగోలు ఆపుతామని కడప వైన్స్ అండ్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాల్‌రెడ్డి, మద్యం వ్యాపారులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉమ్మడి కడప జిల్లాలోని మద్యం షాపులు, బార్ల యజమానులు కడప నగరంలో గురువారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈఎస్ అందుబాటులో లేక పోవడంతో సిబ్బందికి అందజేసి, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు. మద్యం అమ్మకాలపై ఇస్తున్న కమీషన్ ఏమాత్రం చాలడం లేదని, ప్రతి నెల తాము రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల మేర నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు, కడప, రాయచోటి, రాజంపేట, కమలాపురం, బద్వేలు, పులివెందుల బార్, వైన్ షాపుల ఓనర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై విద్యార్థుల దాడి బాధాకరం



ఉపాధ్యాయుడి మృతదేహం వద్ద ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి

వైవీయూ : రాయచోటిలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్‌పై విద్యార్థులు దాడి చేసి చంపేయడం బాధాకరమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎజాస్ అహ్మద్ మృతదేహాన్ని ఎమ్మెల్సీ గురువారం సందర్శించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుడి మృతి ఘటనకు బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అప్పస్మా అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ వి.ఆర్.రెడ్డి, నాయకులు రమణారెడ్డి, నాగసుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఉపాధ్యాయుడి హత్యపై న్యాయ విచారణ జరిపించాలని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా డిమాండ్ చేశారు. గురువారం ఆప్ కీ ఆవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడిపై విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడి భార్య మీడియాతో మాట్లాడిన మాటలను బట్టి అనేక రకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు.

నైతిక విలువల కోసం సంస్కరణలు చేపట్టాలి

విద్యా వ్యవస్థలో నైతిక విలువల కోసం ప్రభుత్వం వెంటనే సంస్కరణలు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి ఎస్.తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు అఫ్జల్‌ఖాన్, జకరయ్య, సత్తార్, సలావుద్దీన్, మల్లెం విజయభాస్కర్, ప్రసాద్‌గౌడ్, మైనుద్దీన్, రఫీక్, సుబ్బారెడ్డి, ఉత్తన్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ కోసం పోరాటం



అంబేడ్కర్ సర్కిల్‌లో ఉక్కు సాధన ఐక్యవేదిక నాయకుల నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసే వరకు పోరాటం చేపడతామని ఉక్కు సాధన ఐక్యవేదిక జిల్లా నాయకుడు జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆ వేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో జనసేన ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కడప ఉక్కు నిర్మాణం ఎన్‌డీఏ ప్రభుత్వ అజెండాలో నేడు లేదని ప్రకటన చేయడం బాధ్యతా రాహిత్యమైన చర్య అన్నారు. 2014లో రాష్ట్ర విభజన చట్టంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటును పొందుపరిచారని పేర్కొన్నారు. ఆనాడు యూపీఏ, ఎన్‌డీఏ కలిసి ఆ చట్టాన్ని ఆమోదించాయన్నారు. ఈ విషయాన్ని పాలక ప్రభుత్వాలు గుర్తించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉక్కు సాధన ఐక్యవేదిక నాయకులు రామమోహన్, సుబ్బమ్మ, మనోహర్, దస్తగిరిరెడ్డి, కామనూరు శ్రీనివాసులరెడ్డి, అన్వేష్, రామకృష్ణారెడ్డి, కుమారస్వామిరెడ్డి, చంద్రారెడ్డి, గోపాల కృష్ణయ్య, వెంకట సుబ్బయ్య, శివకుమార్, విజయ్, రవి, రాహుల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు లేక వలస

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు లేక యువత ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం కడపలోని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు నాగమల్లయ్య, నగర కార్యవర్గ సభ్యులు మురళీకృష్ణ, జగదీష్, మహమ్మద్, షంషీర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాగు భూమి ఇవ్వాలి



మాట్లాడుతున్న గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అర్హులైన పేదలకు సాగు భూమి ఇవ్వాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పాలకులు మరిచిపోతున్నారని తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కబ్జాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ మండలాల్లోని అర్హులకు సాగు భూమి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు అభినందన



ఎన్‌సీసీ కేడెట్స్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ అధికారి

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ రాక్ క్లైంబింగ్ నేషనల్ క్యాంపు పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా అభినందించారు. కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ కె.అఖిల, టి.ప్రశాంతి నవంబర్ 15 నుంచి 26వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించిన నేషనల్ క్యాంపులో పాల్గొని వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్స్ వార్షిక క్యాంపులతోపాటు నేషనల్ క్యాంపులకు ఎంపికవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సీటీఓ డాక్టర్ బి.స్వరూప, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ అన్నారు. గురువారం కడప నగర శివారులోని చౌడమ్మ వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011ని వివరించారు. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వృద్ధులను విడిచి పెట్టిన వారు శిక్షార్హులన్నారు. అర్హులు తగిన సమాచారం, సూచనలు, న్యాయసేవల కోసం ప్రతి ఆర్డీఓ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ టోల్‌ఫ్రీ నంబర్: 14567, లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నంబర్ 15100 మొదలైన అంశాలను వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ దృష్టికి తీసుకుని రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చౌడమ్మ ఓల్డ్ ఏజ్ హోం నిర్వాహకులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

నేడు ప్రొద్దుటూరులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొద్దుటూరులోని హౌసింగ్‌బోర్డు కాలనీలోగల వెలుగు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ కార్డ్స్, ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్, ఎయిర్‌టెక్ పేమెంట్ బ్యాంకులలో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా (అగ్రికల్చర్), ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 19-32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఇందుకు అర్హులన్నారు. నిరుద్యోగులు విద్యార్హతల ధృవపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

సరైన మార్గదర్శనంతో విజయం సులువు



కెరీర్ గైడెన్స్ పుస్తకం ఆవిష్కరిస్తున్న స్టెప్ అధికారులు

కడప స్పోర్ట్స్ : విద్యార్థులకు సరైన మార్గదర్శనం లభిస్తే విజయాలను సులువుగా పొందే అవకాశం ఉంటుందని స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ తెలిపారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సెలింగ్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ యువత చెడుమార్గాలకు వెళ్లకుండా మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం కెరీర్ గైడెన్స్ గురించి వివరించారు. రీసోర్స్ పర్సన్ కె.పృథ్వీరాజ్ రాష్ డ్రైవింగ్, ఆన్‌లైన్ గేమింగ్, సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నూర్జహాన్, ఎన్ఎస్ఎస్ పీఓ రాజారావు, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది నాగయ్య, వి.వి.నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు



విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో గురువారం విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎన్‌జీఓ కాలనీ భవిత సెంటర్‌కు చెందిన ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు విజయమ్మ, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ అంధుల పాఠశాలలో..

కడప నగరంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ, శ్రీనివాసులు, రమణ, లక్ష్మీదేవి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్.. ఇదేం ఫిట్‌నెస్



ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్‌పై ఆర్టీఏ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు నిదర్శనం కడప నగరం తిరుపతి రోడ్డులోని రామాంజినేయపురం వద్ద ఓ కార్పొరేట్ స్కూల్ బస్సుకు స్టార్టింగ్ సమస్య తలెత్తింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బస్సును ముందుకు తోయాల్సి వచ్చింది. అనంతరం బస్సు స్టార్ట్ కావడంతో సమస్య తీరింది. అయితే ఈ సంఘటనను చూసిన వారు విస్తుపోయారు. విద్యార్థులతో భారీగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు.. ఇలా వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు.

\- సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప

హలో.. హలో..

అదుపు తప్పితే ఆసుపత్రికి చలో!

సెల్‌ఫోన్ వాహనదారుల కొంప ముంచుతోంది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ధ్యాసంతా ఫోన్‌పైనే ఉండటంతో బండి ఎటువైపు వెళుతుందో తెలియని పరిస్థితి. ఫోన్ మాట్లాడుతూ.. చాటింగ్ చేస్తూ.. పాటలు వింటూ ట్రాఫిక్‌తో సంబంధం లేకుండా వాహనాలు నడుపుతున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని పోలీసులు హెచ్చరిస్తున్నా వినిపించుకోకుండా వాహనదారులు ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఇటీవల జరుగుతున్న ప్రమాదాలు 70 శాతం సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్నవేనని వైద్యులు పేర్కొంటున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపడితే తప్ప నియంత్రించలేమని పలువురు అభిప్రాయపడుతున్నారు. కడప నగరంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న దృశ్యాలివి.

\- సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప








